క్లుప్తంగా

సభ ఏర్పాట్లు పరిశీలన


పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ మున్నూరు కాపు సంఘ భవనంలో ఈ నెల 11న జరిగిన ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాట్లను శనివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, జిల్లా తెలంగాణ జాగృతి అధ్యక్షుడు లక్ష్మణచారి, బీఆర్ఎస్ యువ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. వారి వెంట కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, నేరెళ్ల వేణు, నల్లూరి పోశెట్టి నాయకులు నాలం శ్రీనివాస్, అధికారి విజయ్, డి శ్రీనివాస్, కత్తి సుధాకర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్: విద్యుత్ సంస్థ యజమాన్యానికి న్యాయబద్ధంగా చేయాల్సిన వేతన సవరణతో పాటు ఏడాది కాలపు పీఆర్సీని వెంటనే చెల్లించాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు రమణ, అంకం నరేశ్‌లు కోరారు. ఈ విషయమై ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన సమ్మెకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లపై స్పందించకపోవడంతోనే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

'పది' పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సీఐ, తహసీల్దార్, ఎస్సై

ఖానాపూర్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని సీఐ నారాయణనాయక్ అన్నారు. శనివారం తహసీల్దార్ రాజమోహన్‌తో పాటు ఎస్సై ఆర్.శంకర్‌తో కలిసి పట్టణంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు కొనసాగించాలని, ఎవరినీ లోనికి వెళ్లకుండా చూడాలని కోరారు.

ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ముధోల్: మండలానికి నూతనంగా వచ్చిన ఎస్సై సాయికుమార్‌ను శనివారం బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాటివార్ రమేష్, ధర్మపూరి శ్రీనివాస్, జీవన్, సంగోల్ల పోతన్న ఉన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో శ్రీనివాస్ ధోని ఆధ్వర్యంలో నయాబాదిలో శుక్రవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. సినిమా చేసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారి ఆత్మీయులను తలుచుకుని కంటతడి పెట్టుకున్నారు.

నేడు దిలావర్‌పూర్‌లో బలగం సినిమా

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో గ్రామస్తుడు రాచమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం బలగం సినిమా ప్రదర్శన ఉంటుందని పలువురు గ్రామస్తులు తెలిపారు. శ్రీనివాస్ తండ్రి బద్దయ్య, తాత గ్రామ ఫౌండర్ కర్రెన్న జ్ఞాపకార్థం సినిమా ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించ తలపెట్టిన సినిమాను చూడడానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం

సారంగపూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం ఏఎంసీ అధ్యక్షురాలు ఆశ్రితారెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలు, చేసిన అభివృద్ధి పనులతో పాటు నూతనంగా 2023–24ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌కు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. పలు పనులకు తీర్మాణాలు చేసి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు రాథోడ్ దత్తూరాం ఉన్నారు.

స్పర్శతో పసిగడుతారు..





ఆ విద్యార్థులు స్పర్శతోనే అన్ని చెబుతారు... కళ్లకు గంతలు కట్టుకుని పేపర్‌పై గీసిన బొమ్మలను, రాసిన పేర్లను చెప్పుతారు.. తలపై ఉంచిన వస్తువు కలరును గుర్తిస్తారు.. ఇది కేవలం మొదట పది మంది విద్యార్థులు హైదరాబాద్‌లోని రామ కృష్ణ మిషన్‌లో బ్రైటర్ మైండ్స్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు మిగితా వారికి నేర్పించడంతోనే సాధ్యమైంది. దీంతో ఆ విద్యార్థినులు చదువులోనూ రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

- విద్యార్థుల ఏకాగ్రత పెంపునకు శిక్షణ
- రామకృష్ణ మిషన్‌లోని బ్రైటర్ మైండ్స్ ఆధ్వర్యంలో..
- నేర్చుకుని.. నేర్పిస్తున్న విద్యార్థినులు

లక్ష్మణచాంద: ప్రతీ విద్యార్థికి కావాల్సింది పాఠ్యాంశాలపై ఏకాగ్రత పెంచడం, మానసికంగా ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పాఠ్యాంశాలపై ప్రత్యేకంగా దృష్టిని సారించడం, నైతిక విలువలు పెంపొందించుకోవడంతో పాటు ఉన్నతమైన లక్షణాలను అలవర్చుకోవడం వంటి లక్షణాలు విద్యార్థుల్లో కనిపించడం చాలా అరుదు. దీని కోసం హైదరాబాద్‌లోని రామ కృష్ణ మిషన్ కన్హా శాంతివనంలో బ్రైటర్‌మైండ్స్‌లో ఆధ్వర్యంలో అప్పటి నిర్మల్ జిల్లా పాలనాధికారి ఇలంబరిది లక్ష్మణచాంద మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులను శిక్షణ నిమిత్తం 10మందిని పంపించారు.

పది రోజుల శిక్షణ

బ్రైటర్ మైండ్స్ శిక్షణలో భాగంగా విద్యార్థినుల ఏకాగ్రతను పెంపొందించుకోవడం, చెడు అలవాట్లకు దూరంగా ఉండడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటిని పొదుపుగా వాడుకోవడం, యోగా, నైతిక విలువల పెంపుదల, ఆహార పదార్థాల వృథాను అరికట్టడం వంటి పలు అంశాలపై శిక్షణ పొందారు. అలాగే యోగాలో శ్వాస, కళ్ల వ్యాయామం, సైంటిఫిక్ మ్యాజిక్ వంటివి నేర్పించారు. పది రోజుల శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన తరువాత 10మంది విద్యార్థులు తమ పాఠశాలలోని మిగతా వారికి నేర్పించారు. అది నేటికీ నిర్విరామంగా కొనసాగుతూనే ఉంది.

కళ్లకు గంతలు కట్టుకొని చెబుతారు..

కళ్లకు గంతలు కట్టుకుంటే సాధారణంగా మనకు ఏమి కనిపించదు. శిక్షణ పొందిన విద్యార్థులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకొని వస్తువుల రంగులు, కాగితాలపై ఉన్న బొమ్మలను, వాటి గుర్తులను చెప్పడం విశేషం. ఇలా చెప్పడం సాధారణంగా కుదరదు కాని బ్రైటర్ మైండ్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు నిత్య సాధనతోనే సాధ్యమే అని నిరూపిస్తున్నారు.

నేర్చుకొని నేర్పిస్తున్నాం



బ్రైటర్స్ మైండ్స్ శిక్షణ కేంద్రంలో నేర్చుకున్న వాటిని పాఠశాలకు వచ్చిన తరువాత నిత్యం సాధన చేస్తున్నాం. అలాగే తోటి విద్యార్థులకు సైతం నేర్పిస్తున్నాం. – నిఖిత, కృష్ణవేణి

వ్యాయామం ఎంతో ఉపకరిస్తుంది



శిక్షణ కేంద్రంలో తమకు నేర్పిన వ్యాయామం నేటికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. దీంతో తమకు ఏకాగ్రత పెరిగింది. శిక్షణ అనంతరం ఎంతో మార్పు వచ్చింది. ముఖ్యంగా మొదడుకు చేసే వ్యాయామం అందరి విద్యార్థుల్లో మార్పు తీసుకొచ్చింది.

– మౌనిక, రాజ్యలక్ష్మి, కేజీబీవీ విద్యార్థులు

ఆహార పదార్థాల వృథాను అరికట్టాం



వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఎక్కువగా ఆహారాన్ని వృథా చేస్తుంటారు. అయితే ఆహార పదార్థాల, నీటి వృథాతో కలిగే అనర్థాలను తోటి విద్యార్థులకు తెలిపి వాటిపై అవగాహన కల్పించాం. దీంతో తమ పాఠశాలలోని విద్యార్థులు ఎవరు కూడా ప్రస్తుతం ఆహారాన్ని, నీటిని వృథా చేయడం లేదు. – అర్చన, అనూష, 9వ తరగతి, కేజీబీవీ, లక్ష్మణచాంద

నేటికీ నేర్పిస్తున్నారు



గతంలో హైదరాబాద్‌కు 10మంది విద్యార్థులు శిక్షణకు వెళ్లారు. వారు అక్కడ నేర్చుకున్న విషయాలను ఇక్కడకు వచ్చిన తరువాత విద్యార్థులకు నేర్పించారు. ప్రతీ సంవత్సరం విద్యార్థులు తోటి విద్యార్థులకు నేర్పించడంతో నేటికీ కొనసాగుతోంది.

– నవిత, ప్రత్యేక అధికారి, కేజీబీవీ, లక్ష్మణచాంద

ఒండ్రు మట్టి తరలింపుతో ఆధిక దిగుబడులు


పనులు ప్రారంభిస్తున్న సుమన్‌కుమార్

లోకేశ్వరం: రైతులు పంట పొలాల్లోకి ఒండ్రుమట్టి తరలించుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ నిర్మల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుమన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని బిలోలి గ్రామంలోని ఆడి చెరువులో అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో మన ఊరు–మన చెరువు– మన మట్టి సంకల్పంతో జల పునరుజ్జీవన పథకం (రిస్టోర్ ప్రామిస్ ఆఫ్ వాటర్) కింద రైతుల భాగస్వామ్యంతో మట్టి తరలింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెరువుపూడిక తీయడంతో చెరువు శిఖం (నీటి నిల్వ ప్రాంతం) లోతు పెరిగి ఆయకట్టు కింద భూగర్భ జలాలు పుష్కలంగా పెరుగుతాయని తెలిపారు. ఉప సర్పంచ్ భోజన్న, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ముత్యం, రైతులున్నారు.

'మోదీ గోబ్యాక్'

ముధోల్: తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నరేంద్రమోదీ గోబ్యాక్ అంటు శనివారం సీపీఎం ముధోల్ మండల కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరాస్తా వద్ద నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పి మాటతప్పి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్రానికి రావొద్దని నినాదాలు చేశారు. మండల కార్యదర్శి మురళీ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గంధం లింగన్న ఉన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

భైంసారూరల్: భైంసా పట్టణంలోని గౌరీశంకర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూమారెడ్డి కోరారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఇందులో పీఏసీఎస్ డైరెక్టర్ చాకెటి లస్మన్న, నాయకులు నవీన్‌రెడ్డి, పండరి, గోపి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ గణేశ్, ఉపేందర్ ఉన్నారు.

భైంసాలో వర్షం

భైంసాటౌన్: పట్టణంలో శుక్రవారం రాత్రి మొదలుకొని ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం శనివారం ఉదయం వరకు కురిసింది. దీంతో 16మి.మీల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

సారంగపూర్: మండలంలోని ప్యారమూర్ గ్రామానికి చెందిన చాకలి భూమన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని శనివారం నిర్మల్ మున్సిపల్ కౌన్సిలర్ అయ్యన్న గారి రాజేందర్ పరామర్శించారు. తనవంతుగా రూ.11వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రాయితీ బస్‌పాస్ మేళా


పాస్‌లు పంపిణీ చేస్తున్న డీఎం

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం నిర్వహించిన దివ్యాంగుల రాయితీ బస్‌పాస్‌ల మేళాకు విశేష స్పందన లభించింది. కంట్రోలర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో డిపో మేనేజర్ సాయన్న, సిబ్బంది లక్క నర్సయ్య, డి.గంగన్న పాల్గొన్నారు. ప్రతీ దివ్యాంగుడు ఆర్టీసీ కల్పించే రాయితీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం సాయన్న అన్నారు. ఈ రాయితీ పాస్‌లు పొందిన దివ్యాంగులు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డిలక్స్ బస్సులలో 50శాతం చార్జీతో ప్రయాణించవచ్చన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతల రహదారి



తానూరు: కోలూరు నుంచి మొగ్లి గ్రామానికి ఉన్న రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు గుంతలతో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సంబంధిత అధికారి: జగదీష్, పీఆర్‌ఏఈ, 91211 35623

రోడ్డు పనులు అడ్డుకున్న 'పంచగుడి'


పనులు అడ్డుకున్న పంచగుడి గ్రామస్తులు

లోకేశ్వరం: లోకేశ్వరం నుంచి పంచుగుడి వరకు ఆర్ అండ్‌బీ రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. శనివారం మండలంలోని పంచగుడి –ధర్మోర గ్రామాల సరిహద్దు ప్రాంతంలో రోడ్డు విస్తర్ణ పనులను పంచగుడి గ్రామస్తులు అడ్డుకున్నారు. పనులను గతంలో నిర్వహించిన సర్వే ప్రకారంగా చేపట్టాలని, రోడ్డుకు మూలమలుపు ఉండకుండా చూడాలని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. రోడ్డు వెడల్పు పనుల్లో పంచగుడి గ్రామ వైకుంఠ దామం భవనానికి ఎలాంటి ఆటంకం కలుగకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో భవనానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం రోడ్డు పనులు చేస్తామని గ్రామస్తులకు ఫోన్‌లో చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దెల ఎల్లన్న, ఉపసర్పంచ్ ఇంద్రకరణ్‌గౌడ్, వీడీసీ చెర్మన్ గంజాల గంగాధర్, సభ్యులు లింగన్న, దుబాయి శ్రీనివాస్, పోశెట్టి, మిషన్ నారాయణ, పీరుపటేల్, భోజాప్ప పటేల్, రాజారెడ్డి ఉన్నారు.

నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్‌టీపీ పోరాటం


రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఖానాపూర్: టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కారణంగా నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్ తెలంగాణ పార్టీ పోరాడుతుందని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో పార్టీ అధ్యక్షురాలు షర్మిల పిలుపు మేరకు మేరకు టీసేవ్ కార్యక్రమంలో భాగంగా నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రంలో 30 లక్షలకు పైగా నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. నష్టపోతున్న నిరుద్యోగులందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు శ్రీపాద శేషాద్రి, పట్టణ అధ్యక్షుడు పానగంటి నరేష్, మండల అధ్యక్షుడు బలగం రవీందర్, మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు రైస్ బేగ్, యూత్ మండలాధ్యక్షుడు ఎగుర్ల మహేష్, మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, నాయకుడు కరిపె రాజన్న ఉన్నారు.

తీరిన డ్రెయినేజీ సమస్య

సాక్షి స్పందన


పూడిక తీయడంతో ఇలా..

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని ముత్యాల పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో డ్రెయినేజీ పూడికతో పాటు చెత్తాచెదారంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై శనివారం సాక్షిలో 'రోడ్డుపై పారుతున్న మురుగు' శీర్షికన ప్రచురితమైన అటెన్షన్ ప్లీజ్ కథనానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించారు. మురుగుకాల్వను శుభ్రం చేయించారు.

ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పూజారులు

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మివేంకటేశ్వరాలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ముగిసాయి. చక్రస్నానం, పుష్పయాగం, ఏకాంత సేవ, హోమం, పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరణాలతో నిర్వహించారు. వారం రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలతో భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నారు. గ్రామంలోని 120 మంది భక్తులు దీక్షలను స్వీకరించి సేవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'పేదల అభివృద్ధే బీజేపీ లక్ష్యం'


ప్రచారం నిర్వహిస్తున్న శివకుమార్

లక్ష్మణచాంద: దేశంలోని నిరుపేదల ఆర్థిక అభివృద్ధే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎనిమిదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్ పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

ముధోల్: మండల కేంద్రంలోని వివిధ వాడల్లో బీజేపీ నాయకులు శనివారం ఇంటింటా మళ్లీ బీజేపీ గ్రామగ్రామానా ఓబీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు భోజన్న, మండల అధ్యక్షుడు పోతన్న పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేశారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగ్‌నాథ్, నాయకులు తాటివార్ రమేష్, విష్ణు, నగేశ్ ఉన్నారు.

వానొస్తే.. మురికికూపమే..!


భైంసాలోని వివేకానంద చౌరస్తాలో..


నిర్మల్‌లోని కూరగాయల మార్కెట్ మూలమలుపు వద్ద..

నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా పట్టణం చిన్నపాటి వర్షానికే రోడ్లపై వర్షపు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. భైంసాలోని వివేకానంద చౌరస్తాలో డ్రెయినేజీ నీరు, చెత్తాచెదారం రోడ్డుపై చేరింది. నిర్మల్‌లోని రోడ్లపై నీరు నిలువడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. – భైంసాటౌన్/ సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్